

# యండమూరి కథాస్రవంతి

## – డా.యండమూరి వీరేంద్రనాథ్



## డప్పు..

### (జ్యోతి మాసపత్రిక నవంబర్ 1979 సంచిక నుంచి)




డప్పేశ్వర్రావు మా సెక్షన్లో పనిచేస్తున్నాడనీ, నా కిందేననీ తెలియటంతో పొంగిపోయాను. డప్పు వాయించేవాళ్ళంటే నేను చెవి తెగ్గోసుకుంటాను వేళ్ళతోనూ, అరిచేత్తోనూ శృతి బద్దంగా వాయిస్తూంటే వినటానికి ఎంత సొంపుగా ఉంటుందో..!. అసలు డప్పు వాయించటం అనేది అన్నిటికన్నా ఉత్తమోత్తమమైన కళ అని నా ఉద్దేశ్యం. అంత గొప్ప కళాకారుడు నా సెక్షన్ లో ఉన్నందుకు యెంతో గర్వించి, వెంటనే నాల్గు ఇంక్రిమెంట్లు జారీ చెయ్యవలసిందిగా నా పై అధికారులకి విన్నవించుకున్నాను. నా సిఫార్సుని అంగీకరించి పైవాళ్ళు సదరు ఇంక్రిమెంట్లు జారీచేసేరు.

కళకి తగిన గుర్తింపు లభించినందుకు నేను మహదానందం చెంది, డప్పేశ్వర్రావుని నా గదిలోకి పిల్చి అతనికి ఇచ్చిన ఇంక్రిమెంట్ల సంగతి చెప్పేను. అతడు కూడా అమితానందం చెందినవాడై నా గదిలోనే నా బల్లమీద కొద్ది సేపు డప్పు వాయించి వెళ్ళిపోయేడు. మొత్తం మా సెక్షన్ లో పనిచేసేది ఆరుగురు. అందులో ఆరుగురి పెట్టు పని చేసేది రమణరావు వొక్కడే. ముగ్గురు కొంచెం అటూ యిటూగా పర్లేదు. జోగేశ్వర్రావు మాత్రం ఊహూ. అసలు పెన్ తియ్యడు. ఇక మిగిలింది డప్పేశ్వర్రావు. అంతటి కళాజీవిని పనిచెయ్యమని అడగడమే? కళ్లుపోతాయి.

డప్పేశ్వర్రావు బైటకెళ్ళిన అరగంటకి మిగతా ముగ్గురూ లోపలికి వచ్చేరు. అతడిచ్చిన టీపార్టీ ఆరగించి వచ్చినట్టున్నారు. కిళ్ళీలు బిగించేరు. ముగ్గుర్నీ సాదరంగా కూర్చోబెట్టేను.

"మీకు డప్పు అంటే చాలా ఇష్టంలా ఉందే" అన్నాడు వాళ్ళలో ఒకరు.

"చాలా యిష్టం. అసలు డప్పుని భారతదేశపు ప్రధాన వాద్యంగా పెట్టాలి" అన్నాను కొంచెం ఆవేశంతో.

అది తమకి రాకపోవడంతో తమ దురదృష్టం అన్నారు వాళ్ళు.

వాళ్ళ వైపు జాలిగా చూసేను.

"సార్" అన్నాడు వాళ్ళలో ఒకడు. "మీరు డప్పు వాయించేవాళ్ళని ఇంత ప్రోత్సాహించడం మా అదృష్టం. కళలకి స్థానం లేకుండా పోతున్న పవిత్ర భారత దేశంలో మీలాంటి వాళ్ళున్నారంటే అది మేం చేసుకున్న పుణ్యం".

వాళ్ళిలా డప్పు వాయించడం మొదలు పెట్టేసరికి పొంగిపోయాను.

"నాయిన్లారా మీకేం కావాలి?" అని అడిగేను ఆప్యాయంగా.

"మేము డప్పు నేర్చుకోవాలనుకుంటున్నాం. నేర్చుకుని మీకు పేరు తెస్తాం. ప్రతీరోజూ మూడు గంటలకి వెళ్ళిపోయి డప్పు వాయించడం ప్రాక్టీసు చేసుకోవటానికి పర్మిషన్ ఇవ్వండి సార్" అన్నారు ముక్తకంఠంతో.

సరేనని పర్మిషన్ ఇచ్చేసేను.

వాళ్ళ మొహాలు డప్పంత అయినయ్.

ఆ మరుసటి రోజునుంచీ పని మానేసి అందరూ డప్పు వాయించటం మొదలుపెట్టేరు. వినటానికి ఎంతో బావుండేది. వేళ్ళతో వాయించేది, సుతారంగా వాయించేది, వాడికన్నా బాగా వీడు వాయించేది, వీడికన్నా బాగా వాడు వాయించేది..! అప్పుడప్పుడూ ఇద్దరు ముగ్గురు నా చుట్టూ చేరి కలిసి వాయించేవారు. ఒకోసారి ఒక్కొక్కడూ సెపరేట్‌గా వచ్చి వాయించేవారు.

మూడు గంటలకి సీట్లు కట్టేసి ప్రాక్టీసుకు వెళ్ళిపోయేవాళ్ళు. వారానికొకసారి కచేరీల కోసం మూడు రోజులు డ్యూటీ లీవ్ పెట్టి వెళ్ళేవాళ్ళు.

నా ఆర్గనైజేషన్ కి వచ్చే నష్టాన్ని లెఖ్ఖచేయకుండా డప్పు వాద్యగాళ్ళని ప్రోత్సహిస్తున్నందుకు నాకు మంచి పేరొచ్చింది

రోజులు అన్నీ ఒకేలా గడవవు కదా. ఆ రోజు జోగేశ్వర్రావు రెండు నెలల శలవు పూర్తిచేసుకుని వచ్చి జాయినయ్యేడు. అరగంట తర్వాత నా దగ్గరకొచ్చేడు. నా టేబుల్ మీద ఒక సర్టిఫికెట్టు పడేసేడు.

"ఏమిటిది?" అని అడిగేను.

"కెప్టెన్‌ని" అన్నాడు.

"దేనికి?"

"బురదగుంట గోటీబిళ్ళ అసోసియేషన్‌కి నేనే కెప్టెన్‌ని" అన్నాడు స్టయిల్‌గా.

"అయితే ఏమిటట?" అన్నాను.

"ప్రమోషనూ–ప్రతీరోజూ వన్ అవర్ పర్మిషనూ" అన్నాడు.

నాకర్థం కాలేదు. "ప్రమోషన్ ఏమిటి?" అన్నాను.

"డప్పేశ్వర్రావుకి ఇంక్రిమెంట్లెందుకిచ్చారో నాకు ప్రమోషన్ దానికే" అన్నాడు.

అతడి అజ్ఞానానికి నవ్వేను. "చూడు జోగేశ్వర్ – డప్పేశ్వర్రావు అంటే అఖిల భారతదేశమూ గర్వించదగ్గ డప్పు వాద్యగాడు. నువ్వేమో బురదగుంట అసోసియేషన్ గోటీబిళ్ళ కాప్టెన్‌వి. నీకూ అతడికీ పోలికెక్కడ?"

దానికి అతను అన్నాడు – "డప్పంటే దేశానికి సంబంధించిన వాద్యం. అందుకే అతడు దేశ ఖ్యాతి పొందేడు. మరి గోటీబిళ్ళ, రాష్ట్రం దాటి వెళ్ళలేదుగా! బస్తీమే సవాల్. మా బురద గుంట గోటీబిళ్ళ అసోసియేషన్‌తో ఎవరైనా సరే పోటీకి రండి".

ఆవేశం వస్తే అతడు మనిషి కాడని తెలిసి అనునయించి, "నీ గోటీబిళ్ళవల్ల దేశానికి లాభం ఏమిటోయ్ ?"అని అడిగాను.

"డప్పువల్ల మాత్రం ఏముందండీ?" అని ఎదురు ప్రశ్న వేసేడు.

'ఓరి వెధవాయ్. నాకే ఎదురు సమాధానం చెప్తావా? నీ కాన్‌ఫిడెన్షియల్ రిపోర్టు రానీ నీ పని చెప్తాను' అని మనసులో అనుకొని, పైకిమాత్రం "చూడవోయ్ జోగేశ్వర్రావ్. మంచి డప్పు వాద్యగాడు వాయిస్తూ ఉంటే–వేల వేల మంది గంటల తరబడి అలా...అలా.... మైమరచి వింటూ ఉండిపోతారు తెలుసా?" అన్నాను.

"అది మరీ నేషనల్ వేస్టుకదా" అన్నాడు.

నాక్కోపం వచ్చింది. "ఆ మాట కొస్తే గోటే బిళ్ళ కూడా నేషనల్ వేస్టే. నువ్వెన్నయినా చెప్పు. కేవలం గోటీబిళ్ళ కెప్టెన్‌వి అయినందుకు నీకు ప్రమోషన్ యివ్వలేను" అన్నాను.

"అయితే స్ట్రయిక్ మొదలెడుతున్నా"నన్నాడు.

ఉలిక్కిపడ్డాను. జోగేశ్వర్రావుకి యూనియన్‌లో పలుకుబడి వుంది. మొహం మీద నవ్వు పులిమేసుకొని "ఇంతదానికి స్ట్రయిక్ ఎందుకోయ్. నీ సంగతి నాకు వదిలిపెట్టు" అన్నాను. దాని అర్థం గ్రహించి అతడు సంతృప్తిగా వెళ్ళిపోయేడు. నెల రోజుల్లో అతడికి ప్రమోషనొచ్చింది. ఇద్దరికి ప్రమోషన్ ఇవ్వాలంటే సీనియారిటీ ప్రకారం ఇంకో ఇద్దరికి ఇవ్వాలి కాబట్టి రంగారావుకి, అప్పారావుకి ప్రమోషన్లివ్వాల్సి వచ్చింది. ప్రతి ఐదు ప్రమోషన్లకీ మరో కాస్ట్ వ్యక్తికి ప్రమోషన్ ఇవ్వాలి వచ్చింది.

మిగిలిన ఒక్కడూ (రమణారావు) వచ్చేడు. నిజానికి మా సెక్షన్‌లో సరిగ్గా పనిచేసేది అతడొక్కడే అని ముందే చెప్పను కదా. "సార్! నా పనిలో ఎక్కడయినా లోపం కనబడుతుందా?" అని అడిగేడు.

"లేదోయ్– సూపర్బ్" అన్నాను.

"మరి నాకు ప్రమోషన్!" అని అర్థించేడు.

"చూడు రమణ్రావ్! మన కోటా ఈ సంవత్సరం ఐదే కదా. ఒకటి డప్పు వాయించే వాడికి, ఇంకొకటి గోటీబిళ్ళ ఆడేవాళ్ళకీ ఇచ్చేంగదా" అన్నాను."...మిగతా ఇద్దరూ సీనియర్స్– ఇంకొకరు రిజర్వేషను కాండేటు."

"మీరలా అంటారనే నేను రిజైన్ చేస్తున్నాను సార్" అని చేతిలో లెటర్ బల్లమీద పెట్టేడు.

ఉలిక్కిపడి "అదేమిటోయ్" అన్నాను.

"రోహిణీకార్తె ఎండ శరీరాన్ని మాడ్చేస్తుంటే సల సల కాగే నూనె ముందు మిట్టమధ్యాహ్నం రావిచెట్టు కింద కూర్చొని మా నాన్న పల్లెటూళ్ళో పుణుకులు అమ్ముకునేవాడు సార్! నలభై సంవత్సరాల్నించీ పైసా పైసా కూడబెట్టి అర్థాకలితో కడుపు మాడ్చుకొని నన్ను చదివించాడు. రావి చెట్టు ముసలిదైంది. నన్ను చదివిస్తూ చదివిస్తూ మా నాన్న పండుటాకు అయ్యేడు. చదవటం తప్ప ఇంకేమి నేను నేర్చుకోలేదు సార్! నాకు గోటీబిళ్ళ ఆడటం రాదు. డప్పు వాయించటం రాదు. వెనుకబడిన కాస్టువాడినని సర్టిఫికెట్టు సంపాదించటం చేతకాదు. పనిచెయ్యటం తప్ప నాకింకేమీ రాదుసార్. దానికి విలువలేని ఈ వ్యవస్థలో ఇలా ఫైళ్ళ మధ్య బ్రతకటం కన్నా మా పల్లెలో రావిచెట్టు క్రింద నా తండ్రి పక్కనే కూర్చొని పని చేసుకోవడం సంతృప్తిగా వుంటుందని అనుకొంటున్నాను సార్ " అని వెళ్ళిపోయాడు.

బైట మావాళ్ళు వాయిస్తున్న డప్పు వినబడ్తూనే వుంది.

కాని రమణారావు మాటలు అంతకన్నా గట్టిగా గుండెలమీద మోగుతున్నట్టున్నాయి.

★★★

# (వచ్చే నెల మరో కథతో కలుసుకుందాం)